రూ.కోట్లు ఖర్చు చేసినా రక్షణ కరువే

- ఆకతాయిలను అడ్డుకోలేకపోతోన్న ప్రహరీ గోడ
- కార్మికనగర్ నిమ్స్‌మే స్థలంలో మారని పరిస్థితి
- మూడు నెలల్లో రెండు దారుణాలు
- ఆందోళన వ్యక్తం చేస్తోన్న స్థానికులు



నిమ్స్‌మే మైదానంలో చెట్లను తొలగిస్తున్న యంత్రం

బోరబండ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్ డివిజన్ పరిధిలోని కార్మికనగర్ ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ (నిమ్స్‌మే) స్థలంలో రక్షణ కోసం రూ.కోట్లు ఖర్చు చేసినా ప్రయోజనం ఉండటం లేదు. సుమారు పది కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఈ స్థలం చుట్టూ గోడ నిర్మించారు. గోడ పైన ఇనుప కంచె సైతం ఏర్పాటు చేశారు. అయినప్పటికీ ఇక్కడ జరిగే దారుణాలను అడ్డుకోలేకపోతున్నారు. నిమ్స్‌మే మైదానంలో ఉన్న ఒక్కప్పటి ఔట్ పోలీస్ స్టేషన్ పరిధిలో పూర్తి స్థాయి మధురానగర్ పోలీస్ స్టేషన్ వచ్చినా, మరి కొంత దూరంలో బోరబండ పోలీస్‌స్టేషన్ ఉన్నా ఇక్కడ పరిస్థితుల్లో మార్పు రావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత మూడు నెలల వ్యవధిలో జరిగిన టీవీ సీరియల్ మేకప్ ఆర్టిస్ట్ తరుణ్ తేజ్ దారుణ హత్య, సోఫాలు రిపేర్ చేసే మహ్మద్ పర్వీన్‌ఖాన్‌పై దుండగులు దాడి చేసి గొంతు కోసిన ఘటనలు ఇక్కడి పరిస్థితులకు అద్దంపడుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



గోడ కింద నుంచి వెళ్లకుండా అడ్డుగా పెట్టిన దిమ్మెలు

గోడ నిర్మాణంలో లోపం..

కాలనీల్లో ప్రజలు వాడిన నీటితో పాటు ఎగువ బస్తీల నుంచి వచ్చే వర్షపు నీరు నిమ్స్‌మే స్థలంలోని ఓపెన్ నాలా నుంచి వచ్చి రహ్మత్‌నగర్ ఓపెన్ నాలాలో కలుస్తుంది. ఈ క్రమంలో కార్మికనగర్ చౌరస్తా వద్ద వంద అడుగుల రోడ్డులో నాలా కింది భాగాన్ని వదిలేసి సిమెంట్ భీమ్ సహాయంతో పైనుంచి ప్రహరీ గోడ నిర్మించారు. దీంతో ఆకతాయిలు ఇక్కడి నుంచి లోపలికి వెళ్తున్నారు.



గోడ సందులో నుంచి బయటకు వస్తున్న యువకుడు

నేరాల కట్టడికి ఏం చేయాలి..

రోడ్డుకు ఇరువైపులా ఉన్న నాలాను కింది నుంచి పూడ్చితే లోపలికి ఎవరూ వెళ్లే అవకాశం ఉండదు. నిమ్స్‌మే స్థలం బోరబండ, మధురానగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోకి వస్తుంది. ఈ రెండు స్టేషన్ల పోలీసు అధికారులు సమన్వయంతో వ్యవహరించి ఖాళీ స్థలం ప్రధాన గేట్ల ముందు నిత్యం రక్షక్ బండి ఉండేలా చూడాలి.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి లోపలకు వెళ్లేవారిని గుర్తించాలి. రాత్రి వేళల్లో తప్పనిసరిగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలి. నిమ్స్‌మే అధికారులతో మాట్లాడి హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలి.



నిన్నటి వరకు విగ్రహాలను నిలిపిన ప్రాంతం

పాత వినాయక విగ్రహాల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎర్రగడ్డ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): 'ఏడాదిగా రహదారి పక్కనే గణేష్ విగ్రహాలు' అనే శీర్షికతో, తొలగించని విక్రయదారులు, పట్టించుకోని అధికారులు అనే ఉప శీర్షికతో 26వ తేదీ(సోమవారం) ప్రచురితమైన ఆంధ్రజ్యోతి వార్తకు స్పందన లభించింది. సంవత్సర కాలంగా పట్టించుకోని గణేష్ విగ్రహ విక్రయదారులు గురువారం అక్కడి నుంచి వినాయక పాత విగ్రహాలను తొలగించారు. గత సంవత్సరం వినాయక చవితికి తయారుచేసిన విగ్రహాలు ఇప్పటికీ ఎర్రగడ్డ జాతీయ రహదారి పక్కన దర్శనమిస్తున్నాయని, ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ విగ్రహాలు పగిలి అక్కడే పడి ఉన్నాయని ఆ వార్తలో ప్రచురితమైంది. వార్తకు స్పందించిన గత సంవత్సరం వినాయక విగ్రహాలను అక్కడ వదిలి వెళ్లిన విక్రయదారులు గురువారం వచ్చి వాహనాలలో అక్కడి నుంచి పాత విగ్రహాలను తరలించారు. సంవత్సర కాలంగా అక్కడే పడి ఉన్న విగ్రహాలు ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్త మూలంగా తొలగించబడటంతో ప్రజలు, మిగతా విక్రయదారులు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

బంజారాహిల్స్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): దశలవారీగా డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెంకటేశ్వరనగర్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి అన్నారు. బంజారాహిల్స్‌లోని శ్రీవెంకటేశ్వరనగర్‌లో రూ. ఐదు లక్షలతో సీసీ రోడ్డు పనులను స్థానికులతో కలిసి కార్పొరేటర్ గురువారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో నెలకొన్న సమస్యల నివేదికను సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులకు అందజేసినట్టు చెప్పారు. వాటి ప్రతిపాదనలు కూడా పూర్తయ్యాయని నిధులు మంజూరు చేయించి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోనున్నట్టు వెల్లడించారు. వర్షాకాలం నేపథ్యంలో సీసీ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని గుత్తేదారుకు సూచించారు. జీహెచ్ఎంసీ ఏఈ సతీష్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కవితారెడ్డి



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్

ఫిలింనగర్ వినాయకనగర్‌లో..

బంజారాహిల్స్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో వేగం పెంచాల్సిన అవసరం ఉందని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ అన్నారు. ఫిలింనగర్ వినాయకనగర్‌లో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు పనులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఫిలింనగర్‌లోని 18 బస్తీల్లో డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్‌లు పూర్తి చేసిన అనంతరం రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్టు చెప్పారు. వినాయకచవితి వస్తుండడంతో రోడ్డు పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఏఈ వెంకటేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ జయచంద్ర, బీఆర్ఎస్ నాయకులు రమేష్, దయానంద్, శెట్టి, మనోహర్, సూరి పాల్గొన్నారు.

ఎర్రగడ్డలో మ్యాన్‌హోల్ మరమ్మతు పనులు

ఎర్రగడ్డ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డలోని జామియా మసీద్ ప్రాంతంలో మున్సిపల్ అధికారులు గురువారం మరమ్మతు పనులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఐఎం నాయకులు మొహమ్మద్ అజార్ మాట్లాడుతూ డివిజన్‌లోని జామియామసీద్, ప్రేమ్‌నగర్, సుల్తాన్‌నగర్ తదితర ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న మరమ్మతు పనులను అధికారులు నిర్వహించారన్నారు. పెండింగ్‌లో ఉన్న మరికొన్ని మరమ్మతు పనులను త్వరలో నిర్వహించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులతో పాటు ఎంఐఎం పార్టీ, స్థానిక నాయకులు షకీల్, బాబు, ఆయుబ్, గౌస్, మహమ్మద్ అన్వర్, మహమ్మద్ అమీర్ తదితరులు పాల్గొన్నారు.



మ్యాన్‌హోల్ మరమ్మతు పనులు నిర్వహిస్తున్న సిబ్బంది

ఆక్రమణలను తొలగించి నాలా పునర్నిర్మాణం చేయండి

యూసుఫ్‌గూడ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): భారీగా కురిసిన వర్షానికి యూసుఫ్‌గూడ లక్ష్మీనర్సింహనగర్‌లో ప్రధాన నాలా కూలిపోయింది. ఈ నాలా పూడిపోవడం వల్ల ఈ ప్రాంతానికి చాలా ఇబ్బందులు ఎదురవుతాయని వెంటనే నాలా మరమ్మతులు చేయాలని బీజేపీ జూబ్లీహిల్స్ ఇన్‌చార్జి లంకల దీపక్‌రెడ్డి శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ కార్యాలయంలో గురువారం వినతిపత్రం అందించారు. వెంకటగిరిలోని తాడిపత్రి బిర్యానీ పాయింట్ నుంచి స్రవంతినగర్, కృష్ణనగర్ బీబ్లాక్, ఏ బ్లాక్‌ల మీదుగా లక్ష్మీనర్సింహనగర్ నుంచి ప్రవహించే ఈ నాలా చాలా అన్యాక్రాంతం అయ్యిందని, ఇటీవల కాలంలో నాలాను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో నాలా సామర్థ్యం సరిపోక భారీ వర్షాలు వచ్చినప్పుడు వరదనీరు ఇళ్లలోకి చేరుతుందని, ఆక్రమణలను తొలగించి నాలాను పునర్నిర్మాణం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుంబాల గంగరాజు, డీ.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

బ్రెయిన్‌డెడ్ యువకుడి నుంచి అవయవాల సేకరణ

సనత్‌నగర్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): బ్రెయిన్‌డెడ్‌కు గురైన యువకుడి నుంచి జీవన్‌దాన్ సభ్యులు అవయవాలు సేకరించారు. మహబూబ్‌నగర్‌కు చెందిన గుంత చెన్నయ్య (35) తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. ఈనెల 26న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రగాయాల పాలైన ఇతడిని ముందుగా మహబూబ్‌నగర్ ఆస్పత్రికి, మెరుగైన చికిత్స కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మూడు రోజులు చికిత్స అందించిన వైద్యులు బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారించారు. అవయవదానంపై అవగాహన కల్పించిన జీవన్‌దాన్ సభ్యులు లివర్, రెండు కిడ్నీలు, 2 కార్నియాలు సేకరించారు.



గుంత చెన్నయ్య

విశ్వవిద్యాలయాలకు వీసీలను నియమించండి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలకు వైస్ చాన్స్‌లర్స్‌ను నియమించాలని అఖిలభారత విశ్వవిద్యాలయాల ఉద్యోగుల సమాఖ్య అసిస్టెంట్ ట్రెజరర్ జి.మహేశ్వర్‌గౌడ్, జనరల్ సెక్రటరీ ఎండీ. హబీబుద్దీన్ డిమాండ్ చేశారు. అఖిల భారత విశ్వవిద్యాలయాల బోధనేతర సిబ్బంది సమాఖ్య పిలుపు మేరకు జూబ్లీహిల్స్‌లోని అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో గురువారం 'డిమాండ్స్ డే' నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ.. పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను వెంటనే విడుదల చేయాలని, బోధనేతర ఖాళీలు భర్తీ చేయాలని, పాలకమండలిలో బోధనేతర ఉద్యోగులకు సభ్యులుగా అవకాశం కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రభుత్వం ఉద్యోగులతో సమానంగా ఈహెచ్ఎస్ పథకాన్ని వర్తింపచేయాలని, టైం స్కేల్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. నాన్‌టీచింగ్ అడ్మినిస్ట్రేషన్ పోస్టుల్లో ప్రొఫెసర్లను నియమించాలని, అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో 6 శాతం ఉన్నత విద్యకు కేటాయించాలన్నారు. అనంతరం విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బోధనేతర సిబ్బంది సమాఖ్య నాయకులు, ఉద్యోగులు కె.పాండు, పి.విశ్వనాథ్, కె.ప్రేమ్‌కుమార్, పి.రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యరంగంలో టెక్నాలజీని విస్తరిస్తాం

- కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ ఏవి గురవారెడ్డి
- ఆస్పత్రిని సందర్శించిన మాల్దీవ్ హెల్త్‌కేర్ ప్రతినిధి బృందం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఆధునిక వైద్య సేవలను మరింత విస్తృతం చేయడంతో పాటు వైద్యరంగంలో వస్తున్న టెక్నాలజీని విస్తరించేందుకు కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రి దృష్టి సారిస్తుందని ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏవి గురవారెడ్డి తెలిపారు. బుధవారం మాల్దీ హెల్త్‌కేర్ నుంచి మాలి సిటీ గ్రూప్ ఆఫ్ ఆస్పత్రుల సీఈఓ ఇబ్రహీం అబ్దుల్ రజాక్ హలీం నేతృత్వంలో డిప్యూటీ సీఈఓ డాక్టర్ షా అబ్దుల్లా మహిర్, మహమ్మద్ ముబరాక్ తదితరుల బృందం ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా గురవారెడ్డితో కలిసి వైద్య ఆరోగ్య సేవలను మరింత మెరుగుపరిచేందుకు తగిన సహాయ సహకారాల విషయంపై చర్చించారు. కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి, మాల్దీవుల ఆరోగ్యమంత్రిత్వ శాఖల మధ్య భాగస్వామ్యాన్ని నెలకొల్పడం, మాల్దీవుల్లో వైద్య నైపుణ్యం, శిక్షణ కార్యక్రమాలు, వర్క్‌షాప్ ద్వారా టెక్నాలజీని విస్తరించే అంశాలపై చర్చించారు. మాల్దీవుల్లో ఆధునిక శిక్షణ ద్వారా అక్కడి వైద్యుల నైపుణ్యాలను పెంపొందించడంతోపాటు ఆరోగ్య సంరక్షణ సేవలను బలోపేతం చేయడంలో కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రి ముందుంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి సీఓఓ సుధాకర్‌జాదవ్, కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రి ఇంటర్నేషనల్ హెడ్ గోకుల్ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.



కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రిని సందర్శిస్తున్న మాల్దీవ్ హెల్త్‌కేర్ ప్రతినిధి బృందం



రహ్మత్‌నగర్ డివిజన్‌లోని తాగునీరు, డ్రైనేజీ, పైప్‌లైన్ సమస్యల ప్రతిపాదనలను కార్పొరేటర్ సీఎన్ రెడ్డి ఖైరతాబాద్ జలమండలి కార్యాలయంలో ఫైనాన్స్ మేనేజర్ అనూషకు గురువారం అందజేశారు. సమస్యలను ఎండీ దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు.
- యూసుఫ్‌గూడ, ఆంధ్రజ్యోతి

గణేశ్ ఉత్సవాల్లో పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

- పంజాగుట్ట ఏసీపీ ఎస్.మోహన్‌కుమార్

పంజాగుట్ట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పంజాగుట్ట ఏసీపీ ఎస్.మోహన్‌కుమార్ సూచించారు. గురువారం పంజాగుట్ట పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని పంజాగుట్ట, మధురానగర్ పోలీస్‌స్టేషన్లలోని సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. నిర్వాహకులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, నిమజ్జనం మార్గంలో ఎక్కడెక్కడ రోడ్లపై గుంతలు ఉన్నాయి, చెట్లకొమ్మలు అడ్డు ఉన్నాయి, విద్యుత్‌తీగలు ఎక్కడ ప్రమాదకరంగా ఉన్నాయి, సమస్యాత్మక ప్రాంతాల వివరాలు ముందుగా సేకరించాలని ఆయన సూచించారు. సేకరించిన వివరాలను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించాలని అన్నారు. నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో రెండు పోలీస్‌స్టేషన్ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పంజాగుట్ట ఏసీపీ మోహన్‌కుమార్

వైభవంగా హరికథా త్రిరాత్ర మహోత్సవాలు

పంజాగుట్ట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల శ్రీకళాపీఠం ఆధ్వర్యంలో మదజ్జాడ ఆదిభట్ల నారాయణదాసవరేణ్యుల 160వ జయంతి, ఆదిభట్ల శ్రీకళాపీఠం 13వ వార్షికోత్సవం సందర్భంగా పంజాగుట్టలోని వైస్రో ఇండియా ఆడిటోరియంలో హరికథా త్రిరాత్ర మహోత్సవాలు గురువారం రాత్రి ప్రారంభమయ్యాయి. కళాపీఠం వ్యవస్థాపకురాలు కరాటే కళ్యాణి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరుగనున్న ఈ మహోత్సవాలను పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఎల్లా వెంకటేశ్వరరావు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ అనంతలక్ష్మి, జమలాపురం లక్ష్మీగణపతి రావు, శ్రీనివాసశర్మలు ప్రారంభించారు. ముందుగా విష్ణు, లలిత సహస్ర నామాలతో ప్రారంభమైంది. ప్రముఖ సంగీత దర్శకులు తారక రామారావు, పడాల ధీరజ్‌చంద్ర, పడాల విజయలక్ష్మి బృందంచే సంకీర్తనా గానం నిర్వహించగా, ప్రముఖ సినీనటి కరాటే కళ్యాణి విశ్వామిత్ర యాగ రక్షణ హరికథా గానం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పద్మశ్రీ పురస్కార గ్రహీత గాలిపర్తి ఉమామహేశ్వరి భాగవతారినికి హరికథా గాన రాజసింహ బిరుదుతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రమేష్‌యాదవ్, ప్రముఖ సినీ నటులు పృథ్వీరాజ్, రఘుబాబు, సినీనటి అన్నపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.



శ్రీ ఆదిభట్ల శ్రీకళాపీఠం వార్షికోత్సవంలో మాట్లాడుతున్న డాక్టర్ వెంకటేశ్వరరావు

జేఎన్‌టీయూలో సెంట్రలైజ్డ్ స్పాట్ కౌన్సెలింగ్

- 8 అనుబంధ ఇంజనీరింగ్ కాలేజీలకు హైదరాబాద్‌లోనే నిర్వహణ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూకు అనుబంధంగా ఉన్న ఎనిమిది ఇంజనీరింగ్ కాలేజీల్లో కౌన్సెలింగ్ అనంతరం మిగిలిపోయిన సుమారు 800కు పైగా సీట్లను స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా భర్తీకై రిజిస్ట్రార్ గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు. అయితే ఏ కాలేజీలో సీట్లను ఆ కాలేజీలోకాకుండా అన్ని కాలేజీల్లో సీట్ల భర్తీకి హైదరాబాద్‌లోనే సెంట్రలైజ్డ్ కౌన్సెలింగ్ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ నెల 30న జేఎన్‌టీయూ హైదరాబాద్, సుల్తాన్‌పూర్ కాలేజీల్లో మిగిలిన సీట్లకు, 31న మంథని, జగిత్యాల జేఎన్‌టీయూ కాలేజీల్లో సీట్లకు, 2న వనపర్తి, సిరిసిల్ల, పాలేరు, మహబూబ్‌బాద్ జేఎన్‌టీయూ కాలేజీల్లో మిగిలిపోయిన సీట్లకు స్పాట్ కౌన్సెలింగ్ ఉంటుందని.. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హతల ధ్రువపత్రాలతో ఆయా తేదీల్లో జేఎన్‌టీయూలోని అడ్మిషన్స్ విభాగంలో హాజరుకావచ్చని తెలిపారు. స్పాట్ ద్వారా అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే సెంట్రలైజ్డ్ స్పాట్ కౌన్సెలింగ్ వల్ల ఖమ్మం, మహబూబాబాద్, మంథని, వనపర్తి, సిరిసిల్ల ప్రాంతాలకు చెందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హైదరాబాద్‌కు వెళ్లాల్సి రావడం ఇబ్బందికరంగా భావిస్తున్నారని కొన్ని కాలేజీల ప్రిన్సిపాళ్లు చెబుతున్నారు. ఇంతకు ముందు మంథని జేఎన్‌టీయూ కాలేజీలో సింగరేణి కోటా సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లుగానే వర్సిటీ అడ్మిషన్ విభాగం అధికారులు అనుబంధ కళాశాలలకు వచ్చి స్పాట్ ప్రక్రియను చేపడితే బాగుండేదంటున్నారు.

నిబంధనలు పాటించని స్పా నిర్వాహకుడిపై కేసు నమోదు

యూసుఫ్‌గూడ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించకుండా స్పా నిర్వహిస్తున్న వ్యక్తిపై మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్ఆర్‌నగర్ సమీపంలో నవీన్‌గౌడ్ అనే వ్యక్తి యాపిల్ బ్యూటీ సెలూన్ అండ్ స్పాపేరుతో సెలూన్ స్పా నిర్వహిస్తున్నాడు. స్పా నిర్వాహకుడు నిబంధనలు పాటించడం లేదని స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన పోలీసులు స్పా సెంటర్‌పై దాడి చేసి పరిశీలించగా నిబంధనలు పాటించటం లేదని, సీసీ టీవీ పని చేయటం లేదని, స్పా థెరపిస్టులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేదని, కస్టమర్స్ రికార్డ్ సక్రమంగా నిర్వహించడం లేదని నిర్ధారణ అయ్యింది. దీంతో నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు.

ముఖం మీద యాసిడ్ పోసి దారి దోపిడీ

బంజారాహిల్స్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ముఖం మీద యాసిడ్ పోసి దారి దోపిడీ చేసిన ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. వెస్ట్ బెంగాల్‌కు చెందిన నసీం మల్లిక్ బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 10 జహీరానగర్‌లో నివాసముంటున్నాడు. ఈనెల 23న ఓ శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు నెంబరు13 శ్మశానవాటిక వద్ద ఆరుగురు అడ్డగించారు. బెదిరించి అతని జేబులు వెతికారు. ప్యాంటు జేబులో ఉన్న రూ. ఐదు వేలు లాక్కున్నారు. అనంతరం అతడిని కొట్టి యాసిడ్ ముఖం మీద పోసారు. మల్లిక్ చేతులు అడ్డుపెట్టుకోవడంతో స్వల్పంగా గాయాలయ్యాయి. స్నేహితుడి సహాయంతో స్థానిక ఆస్పత్రికి వెళ్లి తిరిగి ఉస్మానియాకు వెళ్లాడు. ఈనెల 28న ఫిర్యాదు అందడంతో బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో..

బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 12కు చెందిన సయ్యద్ ఖాద్రి వెల్డింగ్ పని చేస్తుంటాడు. ఈనెల 28న పని మీద సింగాడి బస్తీకి వచ్చాడు. అనంతరం రాత్రి రోడ్డు నెంబరు 11 నుంచి వెళ్తుండగా షోయబ్ అనే యువకుడు అడ్డుకున్నాడు. డబ్బులు కావాలని అడిగాడు. ఖాద్రి లేవని చెప్పడంతో ముఖంపై కొట్టి అతని జేబులో ఉన్న రూ.1100 తీసుకొని పారిపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు, రేపు తాజ్‌కృష్ణాలో 'సూత్ర' వస్త్ర ప్రదర్శన

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పండుగల వేళ సంప్రదాయ వస్త్రాలతో పాటు సరికొత్త ఫ్యాషన్ దుస్తులను అందించే ఉద్దేశంతో సూత్ర ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్ర, శనివారాల్లో బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణ హోటల్ ఈ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశం నలుమూలల నుంచి ఎంపిక చేసి తెచ్చిన ఫ్యాషన్ దుస్తులను ప్రదర్శనలో ఉంచనున్నారు. అలాగే, వేడుకలు, పార్టీలకు మహిళలు ధరించే వస్త్రాలు, ఫ్యూజన్‌వేర్, యాక్సెసరీస్, జ్యుయలరీ, బ్యాగులు, గృహ అలంకరణ సామగ్రి, లైఫ్‌స్టైల్ వస్తువులు, గిఫ్ట్ ఆర్టికల్స్, ఈ ఎగ్జిబిషన్‌లో అందుబాట్లో ఉంటాయని నిర్వాహకులు వెల్లడించారు. ఈ ఎగ్జిబిషన్ సందర్శన పూర్తిగా ఉచితమని పేర్కొన్నారు. సుమారు 50మంది ఎగ్జిబిటర్లు తమ ఉత్పత్తులతో మార్కెట్లో గణనీయమైన ప్రభావాన్ని చూపే విధంగా ఈ సూత్రా ఎగ్జిబిషన్ వేదిక అవనుందన్నారు.

తెలుగు సినీ ప్రొడక్షన్ యూనియన్‌లో రూ.1.37కోట్ల గోల్‌మాల్

- 11 మందిపై క్రిమినల్ కేసులు

బంజారాహిల్స్: తెలుగు సినీ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్ యూనియన్‌లో రూ.1.37 కోట్ల గోల్‌మాల్ జరిగింది. ఇందుకు సంబంధించి సంఘానికి చెందిన 11మందిపై జూబ్లీహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఈ నిధుల అవకతవకలపై యూనియన్ ప్రధాన కార్యదర్శి కాట్రగడ్డ సుధాకర్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని ఆదేశించగా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

ప్రయాణికులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల రికవరీ

- బాధితులకు అందజేత

అమీర్‌పేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆటోలు, బస్సుల్లో ప్రయాణిస్తూ పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను ఎస్ఆర్‌నగర్ పోలీసులు నెల రోజుల వ్యవధిలోనే రికవరీ చేసి బాధితులకు అందజేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. ఈనెలలో తమకు సంబంధించిన 35 సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నామని బాధితులు ఎస్ఆర్‌నగర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టార్(సీఈఐఆర్) పోర్టల్ ద్వారా గుర్తించి బాధితులను గురువారం స్టేషన్‌కు పిలిపించి అందజేశారు. కార్యక్రమంలో డీఐ గోపాల్, ఎస్ఐ రాజు రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.



బాధితురాలుకు సెల్‌ఫోన్ అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి

బీటెక్ అగ్రికల్చరల్, ఫుడ్ టెక్నాలజీ కోర్సులకు 2న స్పాట్ కౌన్సెలింగ్

రాజేంద్రనగర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మిగిలిపోయిన సీట్ల కోసం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. బీటెక్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ కోర్సులలో స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా సీట్లు భర్తీ చేయనున్నారు. అర్హులైన అభ్యర్థులు సెప్టెంబర్ 2వ తేదీ ఉదయం 10.30 గంటలకు రాజేంద్రనగర్‌లోని ఎగ్జామినేషన్ సెంటర్‌లో హాజరు కావాలని రిజిస్ట్రార్ డాక్టర్ రఘురామిరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ స్ట్రీమ్ కింద తెలంగాణ ఎప్‌సెట్2024లో అర్హత సాధించిన లేదా ఇంటర్ లేదా, తత్సమాన కోర్సుల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు కౌన్సిలింగ్‌కు హాజరుకావచ్చన్నారు. ఇతర వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.

తెలంగాణ ఉద్యమంపై ఉచిత అవగాహన తరగతులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): టీజీపీఎస్సీ త్వరలో నిర్వహిస్తున్న గూప్-1, 2 పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు తెలంగాణ ఉద్యమం, చరిత్ర, సంస్కృతి, సాహిత్యంపై విషయ నిపుణులతో ఉచిత అవగాహన తరగతులు నిర్వహిస్తున్నట్లు కృష్ణప్రదీప్స్ 21 సెంచరీ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ కృష్ణప్రదీప్ తెలిపారు. సెప్టెంబర్ 2, 3 తేదీల్లో చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రెండు రోజులపాటు జరిగే తరగతులకు ప్రధాన వక్తలుగా ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాం, టీఎస్‌పీఎస్సీ సిలబస్ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ హరగోపాల్, టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్‌ప్రొఫెసర్ గంటా చక్రపాణి, 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్, టీఎస్‌పీఎస్సీ సిలబస్ కమిటీ మెంబర్లు ప్రొఫెసర్లు అడపా సత్యనారాయణ, గణేష్, గ్రూప్-1 ఆఫీసర్, పోటీ పరీక్షల పుస్తక రచయిత డాక్టర్ ద్యావనపల్లి సత్యనారాయణ, తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ డైరెక్టర్ డాక్టర్ మామిడి హరికృష్ణ పాల్గొంటున్నారని పేర్కొన్నారు. అభ్యర్థులు పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు 91335 17733 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

పండుగల నేపథ్యంలో 60 ప్రత్యేక రైళ్లు పొడిగింపు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): దసరా, దీపావళి, క్రిస్‌మస్, ఛాట్.. తదితర పండుగల సందర్భంగా రద్దీని దృష్టిలో ఉంచుకొని దక్షిణమధ్యరైల్వే పరిధిలో నడుస్తున్న 60ప్రత్యేక రైళ్లను పొడిగిస్తున్నట్లు సీపీఆర్ఓ శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా సికింద్రాబాద్-రామనాథపురం, కాచిగూడ-మధురై, నాందేడ్-ఈరోడ్, కాచిగూడ-నాగర్‌సోల్, సికింద్రాబాద్-కొల్లాం, తిరుపతి-అకోలా, తిరుపతి-పూర్ణ, లింగంపల్లి-కాకినాడ టౌన్, తిరుపతి-సికింద్రాబాద్, కాచిగూడ-తిరుపతి, సికింద్రాబాద్-నాగర్‌సోల్, తిరుపతి-మచిలీపట్నం, సికింద్రాబాద్-అగర్తల, హైదరాబాద్-జైపూర్, హైదరాబాద్-జాల్నా, కాచిగూడ-లైగా, కాచిగూడ-హిస్సార్, హైదరాబాద్-గోరఖ్‌పూర్, తిరుపతి-షిరిడి సాయినగర్, హైదరాబాద్-రెక్సాల్, సికింద్రాబాద్-ధనపూర్, సికింద్రాబాద్-సత్రగచ్చి, షాలిమార్-నిజాముద్దీన్, సికింద్రాబాద్-నిజాముద్దీన్ మార్గాల్లో నడుస్తాయని పేర్కొన్నారు. ప్రత్యేకరైళ్లు అక్టోబర్ 2 నుంచి వచ్చే ఏడాది జనవరి 3వ తేదీ వరకు కొనసాగుతాయని వెల్లడించారు.



సేవాభారతి సెంటర్‌ను సందర్శించిన పద్మశ్రీ హనుమాన్ చౌదరి

మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందించాలి

● హనుమాన్ చౌదరి

బోయిన్‌పల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన మహిళల ఆత్మగౌరవాన్ని పెంచాలని పద్మశ్రీ హనుమాన్ చౌదరి వాలంటీర్లను కోరారు. బోయిన్‌పల్లిలోని సేవా భారతి సెంటర్‌లో పేద విద్యార్థులకు సాధికారతతో పాటు సామాజికంగా ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు ఆత్మగౌరవాన్ని పెంపొందించాలనే సంకల్పంతో ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం సేవాభారతి సెంటర్‌ను ఆయన సందర్శించి అందులో శిక్షణ పొందుతున్న మహిళలు శిక్షకులకు సూచనలు సలహాలను ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో నిర్లక్ష్యానికి గురైన వర్గాల మధ్య సేవా కార్యక్రమాలను ప్రారంభించాలని పిలుపునిచ్చారు. సేవా భారతిలో శిక్షణ పొందిన ఎందరో మహిళలు మంచి స్థానాలలో ఉన్నారని గుర్తుచేశారు. ఇళ్లలో టీవీ చూస్తూ మహిళలు కాలాన్ని వృథా చేయకుండా సేవాభారతి సెంటర్లలో చేరితే రానున్న రోజులలో మనదేశానికి మంచి భవిష్యత్ ఉంటుందని, దీనికి తోడు మన సనాతన ధర్మంపైన అవగాహన కలుగుతుందన్నారు.



బీసీ ఆజాద్ యూత్ ఫెడరేషన్ అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ హన్మంత్‌రావు

బీసీ కులగణన చేయాల్సిందే

● జక్కని సంజయ్ కుమార్

అడ్డగుట్ట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే బీసీ కులగణన చేపడుతామని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి ఈ విషయంలో జాప్యం చేస్తున్నారని, స్థానిక ఎన్నికలకు 42 శాతం రిజరేషన్లు కల్పించాలని కోరుతూ సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో 5వ రోజు నిరాహార దీక్ష చేస్తున్న బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్, హిందూ బీసీ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్ దీక్షకు మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాజీ ఎంపీ హన్మంతరావు, బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ మద్దతు పలికారు.

బీటెక్ అగ్రికల్చరల్, ఫుడ్ టెక్నాలజీ కోర్సులకు 2న స్పాట్ కౌన్సెలింగ్

రాజేంద్రనగర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మిగిలిపోయిన సీట్ల కోసం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. బీటెక్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ కోర్సులలో స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా సీట్లు భర్తీ చేయనున్నారు. అర్హులైన అభ్యర్థులు సెప్టెంబర్ 2వ తేదీ ఉదయం 10.30 గంటలకు రాజేంద్రనగర్‌లోని ఎగ్జామినేషన్ సెంటర్‌లో హాజరు కావాలని రిజిస్ట్రార్ డాక్టర్ రఘురామిరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ స్ట్రీమ్ కింద తెలంగాణ ఎంసెట్ 2024లో అర్హత సాధించిన లేదా ఇంటర్ లేదా, తత్సమాన కోర్సుల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు కౌన్సిలింగ్‌కు హాజరుకావచ్చన్నారు. ఇతర వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.

కళాశాల స్థాయిల్లో ఎన్ఎస్‌యూఐ కమిటీలు : వెంకటస్వామి

హైదరాబాద్,ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కళాశాల స్థాయిలోని విద్యార్థి ప్రతినిధులతో ఎన్ఎస్‌యూఐ యూనిట్‌లను ఏర్పాటు చేసి, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కార్యాచరణ రూపొందించనున్నట్లు రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు వెంకటస్వామి తెలిపారు. గాంధీభవన్‌లో గురువారం జరిగిన ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కమిటీ సమావేశంలో డ్రగ్స్ నియంత్రణకు రాష్ట్రప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎన్ఎస్‌యూఐ జాతీయ కార్యదర్శులు రాష్ట్ర ఇన్‌చార్జ్ లుమహ్మద్ ఫాహద్, ప్రతీక్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలను ఎండగడుతూ పోరాటాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో విద్యార్థుల సమస్యలను తెలుసుకుని వారికి అండగా ఉండాలని సూచించారు.

మాట్లాడుతుండగా సెల్‌ఫోన్ లాక్కెళ్లిన దుండగులు

మారేడుపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నడుచుకుంటూ సెల్‌ఫోన్ మాట్లాడుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తి వద్ద నుంచి ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు వాహనంపై వచ్చి సెల్‌ఫోన్‌ను లాకెళ్లిన సంఘటన బుధవారం రాత్రి ఒంటి గంట సమయంలో కార్ఖానా పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రగిరి కాలనీకి చెందిన శ్రీధర్ జనరల్ బజార్‌లో పనులు ముగించుకొని నడుచుకుంటూ జేబీఎస్ వెళ్తున్న అతన్ని పికెట్ కేవీఎస్ వద్దకు రాగానే ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు వెనక నుంచి వచ్చి చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌ను లాక్కొని పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భార్యాభర్తల మధ్య గొడవ, భర్త ఆత్మహత్య

బోయిన్‌పల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య తరచూ జరుగుతున్న గొడవలతో జీవితంపై విరక్తిచెంది భర్త ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ శివ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం... బోయిన్‌పల్లి బాపూజీనగర్ కమ్యూనిటీ హాల్ వద్ద నివాసం ఉంటున్న సుల్తాన చెంద్రశేఖర్(37) రోజువారి కూలీగా పనిచేసుకుంటూ భార్య హేమలతతో జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో చంద్రశేఖర్ మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో భార్య హేమలత ఫతేనగర్‌లో ఉంటున్న తమ బంధువుల ఇంటికి వెళ్లిపోయింది. రెండు రోజులుగా భార్య ఇంటికి రాకపోవడంతో బుధవారం రాత్రి ఫతేనగర్‌లో ఉన్న భార్య వద్దకు వెళ్లి గొడవపడ్డాడు. మద్యం మత్తులో అర్ధరాత్రి ఇంటికి తిరిగివచ్చిన చంద్రశేఖర్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం స్వాధీనం

అడ్డగుట్ట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వద్ద గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గోపాలపురం పోలీస్‌స్టేషన్ ఎస్సై వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం... సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ గేటు నంబర్ 3, 4 సమీపంలో గుర్తు తెలియని 60 ఏళ్ల వయస్సు ఉన్న వృద్ధుడు చనిపోయి ఉండగా స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి ఆచూకీ వివరాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

నేరేడ్‌మెట్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యమైన సంఘటన నేరేడ్‌మెట్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సాకు చెందిన అభిరామ్‌దాస్(44) స్థానికంగా వినాయకనగర్‌లో ప్లంబర్‌గా పనిచేసుకొని జీవిస్తున్నాడు. ఈ నెల 28న ఇంట్లో పనికి వెళుతున్నానని చెప్పి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. తెలిసిన అన్నిచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. అతని సోదరుడు మధుసూదన్‌దాస్ గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సందీప్‌కుమార్ తెలిపారు.

బిల్లులు చెల్లించాలని పేదలను ఇబ్బంది పెట్టొద్దు

●ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



సమస్యలపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్

రాంగోపాల్‌పేట్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బిల్లులు చెల్లించాలని పేద ప్రజలను ఇబ్బందులకు గురి చేయవద్దని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. గురువారం బేగంపేట డివిజన్ పరిధిలోని జవహర్ జనతా, భర్తన్ కాంపౌండ్ బస్తీలలో వివిధ శాఖల అధికారులు, కార్పొరేటర్ టి.మహేశ్వరీలతో కలిసి పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉచితంగా నీటి సరఫరా చేయగా, ఇప్పుడు నల్లా బిల్లులు చెల్లించాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని, లేకుంటే నీటి సరఫరా నిలిపివేస్తామంటున్నారని, తమ బస్తీలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదని, రోడ్లపైకి మురుగు నీరు చేరి ఇబ్బందులు పడుతున్నామని, బస్తీలో కొన్ని ప్రాంతాలకు తాగునీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని స్థానికులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఎవరూ బిల్లులు చెల్లించవద్దని చెప్పారు. బస్తీలలో నివసించే పేద ప్రజలను బిల్లులు చెల్లించాలని ఒత్తిడి చేయవద్దని అర్హులైన వారందరికీ జీరో విద్యుత్ బిల్లులు, ఉచిత నీటి సరఫరాను వర్తింప చేయాలని, ఇందుకోసం స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ బేగంపేట డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, ఈఈ సుదర్శన్, ఎలక్ట్రికల్ డీఈ శ్రీధర్, ఏడీఈ దుర్గా ప్రసాద్, వాటర్ వర్క్స్ జీఎం వినోద్, డీజీఎం ఆశిష్, శానిటేషన్ డీఈ ధర్మారెడ్డి, స్ట్రీట్‌లైట్స్ ఏఈ భరత్, మాజీ కార్పొరేటర్ అతెల్లి మల్లిఖార్జున్ గౌడ్, రాంగోపాల్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు అతెల్లి శ్రీనివాస్ గౌడ్, బస్తీవాసులు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్లను కేటాయించాలి

పద్మారావునగర్, ఆగస్టు 29, (ఆంధ్రజ్యోతి): బండమైసమ్మనగర్‌లో అర్హత కలిగిన వారికి డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనావాస్ యాదవ్ అన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధి బండమైసమ్మనగర్‌లో పేద ప్రజల కోసం నిర్మించిన ఇళ్లను కేటాయించేలా చూడాలని స్థానికులు గురువారం ఎమ్మెల్యేను కలిసి విన్నవించారు. వెంటనే స్పందించిన ఆయన జిల్లా కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టితో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించి, పేదల కోసం నిర్మించిన ఇళ్లను అర్హతగల వారికి కేటాయించేలా తగిన చర్యలు చేపట్టాలని ఆయనను కోరారు.

గణేశ్ ఉత్సవాలకు అధికారులు సహకరించాలి

● చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ జైపాల్‌రెడ్డి

బౌద్ధనగర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గణేశ్ ఉత్సవాలు శాంతియుతంగా జరిగేందుకు అన్నిరకాల జాగ్రత్తలు తీసుకుంటున్నామని, అధికారులందరూ సహకరించాలని చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి, సికింద్రాబాద్ సర్కిల్ ఉప కమిషనర్ సుభాష్‌రావు అన్నారు. గురువారం సాయంత్రం బౌద్ధనగర్ ఏసీపీ కార్యాలయంలో జీహెచ్ఎంసీ, జలమండలి, విద్యుత్ తదితర విభాగాల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిలకలగూడ డివిజన్ ఏసీపీ కార్యాలయంలో పరిధిలో అత్యధిక సంఖ్యలో మండపాలను ఏర్పాటు చేస్తారని, విగ్రహాలను మండపాలు తీసుకువచ్చేందుకు, నిమజ్జనం తరలించేందుకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా ఆయా విభాగాల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, పెరిగిన చెట్టుకొమ్మలను తొలగించాలని, ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించాలని వారు కోరారు. గణేశ్ ఉత్సవాలు ప్రారంభం అయినప్పటి నుంచి ముగిసేవరకు అధికారులందరూ అందుబాటులో ఉండాలని కోరారు. అత్యవసర సమయాల్లో ఎటువంటి సమస్యలు తలెత్తిన పరిష్కారించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఆయా విభాగాల అధికారులందరికి పోలీసుల సహాయ సహకారాలు అందుబాటులో ఉంటాయన్నారు.

సమావేశంలో ఇన్‌స్పెక్టర్లు సైదులు(వారాసిగూడ), అనుదీప్(చిలకలగూడ), కరుణాకర్‌రెడ్డి(లాలాగూడ) డీఐ రమేష్ గౌడ్, అడ్మిన్ ఎస్సైలు సుధాకర్, బాలరాజు, వార్డు ఇన్‌చార్జీలు ఎండీ ఓమర్ అహ్మద్, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

మీపైన 15 కేసులు.. చెప్పింది వినకపోతే అరెస్టే

● మనీ ల్యాండరింగ్ కేసుల పేరుతో బెదిరించి వృద్ధురాలి ఖాతా ఖాళీ చేసిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మనీ లాండరింగ్ కేసులు, వేధింపుల కేసుల పేరు చెప్పి వృద్ధురాలిని బెదిరించిన సైబర్ నేరగాళ్లు ఆమె ఖాతా ఖాళీ చేశారు. నగరానికి చెందిన వృద్ధురాలు (85)కు గుర్తు తెలియని నంబర్ నుంచి ఓ మహిళ ఫోన్ చేసింది. తాను టెలికాం శాఖ నుంచి ఫోన్ చేస్తున్నానని చెప్పింది. మీ ఫోన్ నంబర్ వినియోగించి వేధింపులు, అసత్య ప్రచారం జరిగాయని, త్వరలోనే మీ నంబర్ బ్లాక్ అవుతుందని హెచ్చరించింది. ఇలా జరగకుండా ఉండాలంటే ఢిల్లీ పోలీసులను సంప్రదించమంటూ, వేరే వ్యక్తిని వీడియోకాల్ ద్వారా లైన్‌లో తీసుకుంది. ఢిల్లీ దరియాగంజ్ పోలీస్‌స్టేషన్ అధికారిగా పరిచయం చేసుకున్న అతడు.. మీపై ఢిల్లీ కోర్టులో 15 కేసులు నమోదయ్యాయని చెప్పాడు. అంతేకాకుండా మీ బ్యాంకు ఖాతాల నుంచి విదేశాలకు కోట్ల కొద్దీ డబ్బు వెళ్లిందని, దీనిపై సీబీఐ అధికారులకు వివరణ ఇవ్వండి అంటూ మరో వ్యక్తికి ఫోన్ కలిపాడు. సీబీఐ అధికారిగా పరిచయం చేసుకున్న అతడు మీపై మనీలాండరింగ్ కేసు నమోదైందని, మీ ఖాతాలు తనిఖీ చేయాలని దానికి సంబంధించి కోర్టు ఆర్డర్ ఉందంటూ కాపీ చూపాడు. ఫిక్స్‌డ్ డిపాజిట్లతోపాటు ఖాతాలో ఉన్న డబ్బు మొత్తం తాము సూచించిన ఆర్‌బీఐ ఖాతాకు మళ్లించాలని చెప్పాడు. వీడియో కాల్ ఆపవద్దని, కెమెరా ముందే ఉండాలని చెప్పాడు. ఈ విషయం ఎవరితోనైనా చర్చించినా వెంటనే అరెస్ట్ చేస్తామని బెదిరించాడు. అలా వృద్ధురాలిని భయపెట్టి గృహనిర్బంధం చేసి, ఆమె ఖాతాలో ఉన్న రూ. 8.75 లక్షలు కాజేశారు. మోసపోయానని గ్రహించిన వృద్ధురాలు స్నేహితుడి సాయంతో సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

అలరించిన రాగరాగిణి సినీగీత కదంబం



గాయనీగాయకులను అభినందిస్తున్న వంశీ రామరాజు, రమణకుమారి

చిక్కడపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాగరాగిణి సాంస్కృతిక సేవా సంస్థ నిర్వాహకులు రమణకుమారి, సుబ్బలక్ష్మి సోదరీమణులు సాంస్కృతిక రంగంలో ప్రత్యేక గుర్తింపు కలవారని వంశీ సంస్థల అధినేత డా.వంశీ రామరాజు అన్నారు. వారు ఉత్తమ కార్యక్రమాలను సమర్థతతో నిర్వహిస్తారని తెలిపారు. త్యాగరాయ గానసభలో గురువారం రాత్రి రాగరాగిణి సాహితీ సేవాసంస్థ సినీ గీత కదంబం కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ గాయని రమణకుమారి, సహ గాయకులు శశిరేఖమల్లాది, మల్లాది ఉష, సుబ్రహ్మణ్యం, దినకర్‌రావు, కమలాకరరావు, ప్రభుకుమార్, రామకుమార్‌తో కలిసి నాటి ఘంటసాల సుశీల జానకి సినిమాలో పాడిన పాటలతో పాటు నేటి బాలు చిత్రంలో పాడిన పాటలు సుమధురంగా ఆలపించారు.

అనంతరం జరిగిన కార్యక్రమంలో వంశీ రామరాజు మాట్లాడుతూ నాటి సుశీల పాటలు రమణకుమారి హృద్యంగా పాడగలరని అభినందించారు. సంస్థ కార్యదర్శి సుబ్బలక్ష్మి నివేదిక సమర్పించారు.

జేఎన్‌టీయూలో సెంట్రలైజ్డ్ స్పాట్ కౌన్సెలింగ్

● 8 అనుబంధ ఇంజనీరింగ్ కాలేజీలకు హైదరాబాద్‌లోనే నిర్వహణ



జేఎన్‌టీయూ పరిపాలనా భవనం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూకు అనుబంధంగా ఉన్న ఎనిమిది ఇంజనీరింగ్ కాలేజీల్లో కౌన్సెలింగ్ అనంతరం మిగిలిపోయిన సుమారు 800కు పైగా సీట్లను స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా భర్తీకి రిజిస్ట్రార్ గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు. అయితే ఏ కాలేజీలో సీట్లను ఆ కాలేజీలో కాకుండా అన్ని కాలేజీల్లో సీట్ల భర్తీకి హైదరాబాద్‌లోనే సెంట్రలైజ్డ్ కౌన్సెలింగ్ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ నెల 30న జేఎన్‌టీయూ హైదరాబాద్, సుల్తాన్‌పూర్ కాలేజీల్లో మిగిలిన సీట్లకు, 31న మంథని, జగిత్యాల జేఎన్‌టీయూ కాలేజీల్లో సీట్లకు, 2న వనపర్తి, సిరిసిల్ల, పాలేరు, మహబూబాబాద్ జేఎన్‌టీయూ కాలేజీల్లో మిగిలిపోయిన సీట్లకు స్పాట్ కౌన్సెలింగ్ ఉంటుందని.. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హతల ధ్రువపత్రాలతో ఆయా తేదీల్లో జేఎన్‌టీయూలోని అడ్మిషన్స్ విభాగంలో హాజరుకావచ్చని తెలిపారు.

స్పాట్ ద్వారా అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే సెంట్రలైజ్డ్ స్పాట్ కౌన్సెలింగ్ వల్ల ఖమ్మం, మహబూబాబాద్, మంథని, వనపర్తి, సిరిసిల్ల ప్రాంతాలకు చెందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హైదరాబాద్‌కు వెళ్లాల్సి రావడం ఇబ్బందికరంగా భావిస్తున్నారని కొన్ని కాలేజీల ప్రిన్సిపాళ్లు చెబుతున్నారు. ఇంతకు ముందు మంథని జేఎన్‌టీయూ కాలేజీలో సింగరేణి కోటా సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లుగానే వర్సిటీ అడ్మిషన్ విభాగం అధికారులు అనుబంధ కళాశాలలకు వచ్చి స్పాట్ ప్రక్రియను చేపడితే బాగుండేదంటున్నారు.

తెలంగాణ ఉద్యమంపై ఉచిత అవగాహన తరగతులు



ఎమ్మెల్సీ కోదండరాంతో కృష్ణప్రదీప్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): టీజీపీఎస్సీ త్వరలో నిర్వహిస్తున్న గ్రూప్-1, 2 పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు తెలంగాణ ఉద్యమం, చరిత్ర, సంస్కృతి, సాహిత్యంపై విషయ నిపుణులతో ఉచిత అవగాహన తరగతులు నిర్వహిస్తున్నట్లు కృష్ణప్రదీప్స్ 21 సెంచరీ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ కృష్ణప్రదీప్ తెలిపారు. సెప్టెంబర్ 2, 3 తేదీల్లో చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రెండు రోజులపాటు జరిగే తరగతులకు ప్రధాన వక్తలుగా ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, టీఎస్‌పీఎస్సీ సిలబస్ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ హరగోపాల్, టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ గంటా చక్రపాణి, 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్, టీఎస్‌పీఎస్సీ సిలబస్ కమిటీ మెంబర్లు ప్రొఫెసర్లు అడపా సత్యనారాయణ, గణేష్, గ్రూప్-1 ఆఫీసర్, పోటీ పరీక్షల పుస్తక రచయిత డాక్టర్ ద్యావనపల్లి సత్యనారాయణ, తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ డైరెక్టర్ డాక్టర్ మామిడి హరికృష్ణ పాల్గొంటున్నారని పేర్కొన్నారు. అభ్యర్థులు పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు 9133517733 ఫోన్‌లో సంప్రదించాలన్నారు.

పండుగల నేపథ్యంలో 60 ప్రత్యేక రైళ్ల పొడిగింపు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): దసరా, దీపావళి, క్రిస్మస్, ఛాట్.. తదితర పండుగల సందర్భంగా రద్దీని దృష్టిలో ఉంచుకొని దక్షిణమధ్యరైల్వే పరిధిలో నడుస్తున్న 60 ప్రత్యేక రైళ్లను పొడిగిస్తున్నట్లు సీపీఆర్‌ఓ శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా సికింద్రాబాద్-రామనాథపురం, కాచిగూడ-మధురై, నాందేడ్-ఈరోడ్, కాచిగూడ-నాగర్‌సోల్, సికింద్రాబాద్-కొల్లాం, తిరుపతి-అకోలా, తిరుపతి-పూర్ణ, లింగంపల్లి-కాకినాడ టౌన్, తిరుపతి-సికింద్రాబాద్, కాచిగూడ-తిరుపతి, సికింద్రాబాద్-నాగర్‌సోల్, తిరుపతి-మచిలీపట్నం, సికింద్రాబాద్-అగర్తల, హైదరాబాద్-జైపూర్, హైదరాబాద్-జాల్నా, కాచిగూడ-లైగా, కాచిగూడ-హిస్సార్, హైదరాబాద్-గోరఖ్‌పూర్, తిరుపతి-షిరిడి సాయినగర్, హైదరాబాద్-రెక్సాల్, సికింద్రాబాద్-ధనపూర్, సికింద్రాబాద్-సత్రగచ్చి, షాలిమార్-నిజాముద్దీన్, సికింద్రాబాద్-నిజాముద్దీన్ మార్గాల్లో నడుస్తాయని పేర్కొన్నారు. ప్రత్యేకరైళ్లు అక్టోబర్ 2 నుంచి వచ్చే ఏడాది జనవరి 3వ తేదీ వరకు కొనసాగుతాయని వెల్లడించారు.

శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణం

అంబర్‌పేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్ ఎన్‌సీహెచ్ కాలనీలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణం గురువారం వైభవంగా నిర్వహించారు. హరిహర భజన మండలి కార్తీక్‌గౌడ్ ఆధ్వర్యంలో భజన గీతాలను ఆలపించారు. రంగు సతీష్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కల్యాణంలో భక్తులు పాల్గొన్నారు.



అధికారులు, స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సామల హేమ

పలు ప్రాంతాల్లో కార్పొరేటర్ హేమ పర్యటన

బౌద్ధనగర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్‌లోని బ్రాహ్మణబస్తీ, మధురానగర్‌కాలనీల్లో కార్పొరేటర్ సామల హేమ అధికారులతో కలిసి పర్యటించి సమస్యలపై చర్చించారు. మధురానగర్‌కాలనీలో సీసీ రోడ్డు మంజూరైందని వినాయకచవితి, మండపాలను దృష్టిలో పెట్టుకుని పనులను వాయిదా వేశామని, నిమజ్జనం తర్వాత సుమారు రూ.30 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తామని కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్, బీఆర్ఎస్ నాయకుడు శైలేందర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు చాపలు, నోట్‌బుక్స్ పంపిణీ చేసిన మాజీ కార్పొరేటర్ స్వరూప

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

బౌద్ధనగర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ తెలుగుబాషా, జాతీయ క్రీడా దినోత్సవాలను గురువారం ఉదయం వారాసిగూడ బ్రాహ్మణబస్తీ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా కుసుమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులు కూర్చొని భోజనం చేయటానికి చాపలు, నోట్‌బుక్స్‌ను మాజీ కార్పొరేటర్ పి.స్వరూపగౌడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన తెలుగుభాషాను అందరూ గౌరవించాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.రవిప్రసాద్‌గౌడ్, సీతాఫల్‌మండి డివిజన్ అధ్యక్షుడు అంబాల రాజేశ్వరరావు, నాయకులు అజయ్, సాయిదత్తు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్ వరలక్ష్మిని సత్కరిస్తున్న తోటి ఉద్యోగులు

సంగీత కళాశాలలో కళార్చన

చిలకలగూడ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మారేడుపల్లి శ్రీభక్త రామదాసు ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో గురువారం కళార్చన పేరిట విద్యార్థులతో సంగీత, నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. విద్యార్థుల కర్ణాటక, హిందుస్తానీ గాత్రం, వీణ, వయోలిన్, మృదంగం, కూచిపూడి నృత్యప్రదర్శనలు అలరించాయి. ప్రిన్సిపాల్ వరలక్ష్మి మాట్లాడుతూ సంగీత, నృత్యాలతో పని వత్తిడి దూరమయి మానసిక ఆనందం లభిస్తుందని, తక్కువ ఖర్చుతో నిష్ణాతులైన వారిచే శిక్షణ అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ కె.వరలక్ష్మి బదలీపై అన్నమాచార్య ప్రభుత్వ సంగీత కళాశాల, హైదరాబాద్‌కు వెళ్లారు. శారద మంధని ప్రభుత్వ సంగీత కళాశాలకు ప్రిన్సిపాల్‌గా పదోన్నతిపై వెళ్లారు. నరసింహులు సీనియర్ క్లర్క్ పదోన్నతిపై సాంస్కృతిక శాఖకి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారికి శాలువ, జ్ఞాపికలు అందజేసి ఆత్మీయ వీడ్కోలు పలికారు. కార్యక్రమమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డా.పరశురాం

వర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి

● కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డా. ఏ. పరశురాం

తార్నాక, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వ్యాప్తంగా అన్ని యూనివర్సిటీలల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రాష్ట్ర ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డా. ఏ. పరశురాం అన్నారు. ఈ మేరకు గురువారం కాంట్రాక్ట్ అధ్యాపకులు ఓయూలోని టెక్నాలజీ కాలేజీ సెమినార్ హాల్‌లో రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ డా. జితేందర్ రెడ్డి, డా. భూమయ్య, డా. ఎ. తిరుపతయ్య, డా. యశ్వంత్ రావు తదితరులు పాల్గొన్నారు.



రూ. 50 వేలు వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తున్న పార్ట్ టైం అధ్యాపకులు

పార్ట్‌టైం అధ్యాపకులకు నెలకు రూ. 50 వేలు వేతనం చెల్లించాలి

తార్నాక, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని అన్ని యూనివర్సిటీల్లో పని చేస్తున్న పార్ట్ టైం అధ్యాపకులకు రాష్ట్ర ప్రభుత్వం నెలకు రూ. 50 వేలు వేతనం చెల్లించాలని పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు తక్షణమే రూ. 50 వేలు వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యాపకులు ఓయూలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్ట్ టైం టీచర్స్ అసోసియెషన్ ప్రతినిధులు డా.రవీందర్‌గౌడ్, డా.నాగేంద్ర, డా. మంచాల లింగస్వామి, డా.ఎ.కొండల్, డా.బిక్షపతి, డా.కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రపతి నిలయంలో ముగిసిన తెలుగుభాషా దినోత్సవాలు

తిరుమలగిరి ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో రెండు రోజులపాటు జరిగిన తెలుగు భాషా దినోత్సవాలు గురువారం ముగిశాయి. గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాష దినోత్సవాన్ని రాష్ట్రపతి నిలయంలో ఘనంగా నిర్వహించామని మేనేజర్ రజనీప్రియ తెలిపారు. ప్రపంచీకరణ నేపథ్యంలో తెలుగుభాష ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశంపై వ్యాసరచన పోటీ, తెలుగుభాషను వాడుక భాషగా తీసుకోవలసిన చర్యలు అనే అంశంపై వక్తృత్వ, తెలుగు పద్య పఠనం పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 400 మంది విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు. తెలుగు గొప్పదనం ప్రాముఖ్యతను విద్యార్థులు పాటలు, కవితలు, కథనాల రూపంలో ప్రదర్శించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, కవి సమ్మేళనం కొనసాగింది. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కవులు, కవయిత్రులు ఐనంపూడి శ్రీలక్ష్మి, డాక్టర్ ఓలేటి పార్వతీశం, డాక్టర్ సిరి, కమలాకర్, మౌనశ్రీ మాలిక్, సౌమ్య, సూర్యకాంతి తదితరులు పాల్గొన్నారు.